ప్రజాశక్తి
శుక్రవారం 26 జులై 2024 5 అనంతపురం





రైలు ఇంజన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న గుంతకల్లు డిఆర్‌ఎం విజయ్‌కుమార్

కార్పొరేషన్ బదిలీల్లో అన్యాయం..!

◆డోలాయమానంలో ఇద్దరు ఉద్యోగులు ◆గత కమిషనర్ నిర్వాకంతో ఇబ్బందులు



ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

అనంతపురం కార్పొరేషన్‌లో ఉద్యోగుల 'బదిలీ'లలు అన్నీఇన్నీ కావు. కొందరు ఉన్నతాధికారుల స్వార్థం కింది స్థాయి ఉద్యోగులను ఇబ్బందుల పాలుజేస్తోంది. కార్పొరేషన్‌లో కమిషనర్ పేషీలో సీసీలుగా పనిచేస్తున్న శ్రీకాంత్, ఉదయ్ కుమార్‌రెడ్డిలను వారి కోరిక మేరకు పది రోజుల క్రితం అప్పటి కమిషనర్ మేఘ స్వరూప్ బదిలీ చేశారు రెవెన్యూ సెక్షన్ ఏ-1 సీటులో పనిచేస్తున్న సాయి శరత్‌కుమార్, బి-4 సీట్లో పనిచేస్తున్న రాంబాబునూ బదిలీ చేశారు. వారి స్థానాల్లో ఎ-1గా శ్రీకాంత్, బి-4గా ఉదయ్ కుమార్‌రెడ్డిలను నియమించారు. ఇంత వరకు బాగానే ఉన్నా, గతంలో ఆ సీట్లలో పనిచేస్తున్న సాయి శరత్‌కుమార్, రాంబాబుకు పోస్టులు కేటాయించలేదు. దీంతో వీరు ఎక్కడ విధులు నిర్వహించాలో తెలియని పరిస్థితి నెలకొంది. కమిషనర్ మేఘ స్వరూప్ బదిలీపై వెళ్తూ అదనపు కమిషనర్ హరిబాబు తయారు చేసిన గుమాస్తాల బదిలీల జాబితాను ఆమోదించి వెళ్లారు. ఒకే సీట్లో మూడు సంవత్సరాలకుపైగా పనిచేసిన వారిని మార్చాల్సి ఉండగా వారికి బదులుగా ఏడాది కాలం కూడా గడవకనే ఆయా సీట్లలో పనిచేస్తున్న వారిని కాసుల కక్కుర్తితో బదిలీ జాబితాలో చేర్చి కమిషనర్ టేబుల్‌పై ఉంచారనే ఆరోపణలు ఉన్నాయి. గత కమిషనర్ జాబితాను క్షుణ్ణంగా పరిశీలించకుండానే అదనపు కమిషనర్ హరిబాబుపై గుడ్డి నమ్మకంతో బదిలీలకు ఆమోదముద్ర వేశారు. కమిషనర్ మేఘస్వరూప్ బదిలీ కావడంతో కార్పొరేషన్‌లో ఉద్యోగుల బదిలీల అంశం సమస్యల్లోకి పడింది. గుమాస్తాల బదిలీల అంశంలో నిబంధనలు పాటించలేదన్న విమర్శల నేపథ్యంలో ఆ జాబితాను ప్రస్తుత కమిషనర్ మూర్తి పెండింగ్‌లో ఉంచారు. ఇతర స్థానాలకు బదిలీ అయిన ఉద్యోగులు వారి పాత స్థానాల్లోనే కొనసాగాలని కమిషనర్ మూర్తి ఆదేశాలు ఇచ్చారు. ఈ ఆదేశాలను అదనపు కమిషనర్ హరిబాబు బదిలీ ఉత్తర్వులు అందుకున్న ఉద్యోగులకు తెలియజేశారు. గుమస్తాల బదిలీల్లో సాయి శరత్ కుమార్‌ను ఎ-1గా, రాంబాబును ఎ-2 సీటుకు బదిలీ చేశారు. తాజాగా గుమస్తాల బదిలీ ఉత్తర్వులు పెండింగ్‌లో ఉంచటంతో సాయి శరత్‌కుమార్, రాంబాబులు త్రిశంకు స్వర్గంలో పడ్డారు. ఇప్పటికే వారి పూర్వ స్థానాల్లో కమిషనర్ పేషీ నుంచి వచ్చిన శ్రీకాంత్, ఉదయ్ కుమార్ రెడ్డిలు చేరిపోయారు. దీంతో సాయి శరత్ కుమార్, రాంబాబుల పరిస్థితి రెండింటికీ చెడ్డరేవడిలా తయారైంది. అనాలోచితంగా వ్యవహరించి గుమాస్తాల బదిలీ జాబితాలను తయారుచేసిన అదనపు కమిషనర్ హరిబాబు, బదిలీపై వెళ్లిన కమిషనర్ మేఘ స్వరూప్ నిర్వాకంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కమిషనర్ పేషీ నుంచి వెళ్లిన వారిని తిరిగి పేషీకి బదిలీ చేస్తేనే సాయి శరత్ కుమార్, రాంబాబులు వారి పూర్వపు స్థానాలకు వెళ్లే వీలుంటుంది. లేకుంటే వారి పరిస్థితి అగమ్యగోచరమనే చెప్పాలి. కొంతమంది అధికారుల అసంబద్ధ, అనాలోచిత నిర్ణయాలతో కార్పొరేషన్ ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. బదిలీల అంశంపై సమగ్ర విచారణ చేసి, ఈ బాధ్యతా రాహిత్య నిర్ణయాలకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలనే భావన కార్పొరేషన్ ఉద్యోగుల నుంచి వ్యక్తం అవుతోంది.

గుత్తి డీజిల్‌షెడ్‌కు 250 రైలు ఇంజన్లు

ప్రారంభించిన డిఆర్‌ఎం విజయ్ కుమార్

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి రైల్వే డీజిల్ షెడ్‌కు రైల్వే బోర్డు 250 డీజిల్ రైలు ఇంజన్లను కేటాయించింది. ఇండియన్ రైల్వేస్, వెబ్ టెక్ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో నూతనంగా రైలు ఇంజన్లు రూపొందించాయి. వాటిలో రైల్వే బోర్డు అధికారులు గుత్తి డీజిల్ షెడ్‌కు 250 కేటాయించగా ప్రస్తుతం 130 డీజల్ రైలు ఇంజన్లు వచ్చాయి. రైల్వే గుంతకల్లు డిఆర్‌ఎం విజయ్ కుమార్ 69114 నంబర్ గల రైలు ఇంజన్‌ను గురువారం నాడు జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఎం విజయ్ కుమార్‌ను గుత్తి రైల్వే సీనియర్ డిఎంఇ ప్రమోద్ శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రైల్వే గుంతకల్లు బ్రాంచి అధికారులు, వెబ్‌టెక్ సంస్థ ప్రతినిధులు సందీప్, రజినీష్, రైల్వే కార్మిక సంఘాల ప్రతినిధులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్

అసెంబ్లీలో తుంగభద్ర ఎగువ కాలువ నిర్వహణపై చర్చ

ప్రశ్నోత్తరాల సమయంలో లేవనెత్తిన ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

ఐదేళ్లుగా నిర్వహణ లేక తుంగభద్ర ఎగువ కాలువ అధ్వానంగా మారిందని, ఆధునీకరణ పనులు నిలిచిపోవడంతో ప్రమాదకరంగా మారిందని, ఈ విషయం రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి దృష్టికి వచ్చిందా అని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో లేవనెత్తారు. ఒకవేళ ఈ విషయం మంత్రి దృష్టికి వచ్చి ఉంటే నిధులు ఎప్పుడు విడుదల చేసి పనులు ఎప్పుడు ప్రారంభిస్తారని ప్రశ్నించారు. దీనిపై జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సమాధాన మిస్తూ 8-7-2020న అప్పటి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఎగువ కాలువ ఆధునీకరణకు సంబంధించిన 6 ప్యాకేజీ పనులను ప్రభుత్వం ముందుగానే నిలిపి వేసిందన్నారు. కాగా తుంగభద్ర ఎగువ కాలువ ఆధునీకరణ వ్యవస్థను పటిష్టం చేసే ప్రతిపాదనలు వివిధ స్థాయిల్లో పరిశీలనలో ఉన్నట్లు తెలిపారు. 40 ఏళ్ల క్రితం నిర్మించిన ఎగువ కాలువ కట్టడం దెబ్బతినిందని, ఆధునీకరణకు 23-11-2007న రూ. 463.5 కోట్ల అంచనా వ్యయంతో 6 ప్యాకేజీలుగా ఈపీసీ పద్ధతిన ఆధునీకరణ పనులు మార్చి 2009లో ప్రారంభించారన్నారు. 51 నెలల్లో ఈ పనులు పూర్తి కావాల్సి ఉండగా 2017 ఆఖరు నాటికి రూ. 309.78 కోట్ల(67.58 శాతం)తో పనులు పూర్తిచేసి గుత్తేదారులు ముందస్తుగా పనులను ముగించారన్నారు. 8-7-2020న అప్పటి ప్రభుత్వం జారీ చేసిన అనుమతుల మేరకు తిరిగి వచ్చే ఐదేళ్లలో ఈ పనులను మరోసారి ప్రతిపాదించరాదనే నిబంధన విధించారన్నారు. కాగా 8-7-2020న జరిగిన ఐఎబి సమావేశంలో కాలువ దుస్థితి, రెగ్యులేటర్లు, వంతెనలు కూలడం వల్ల నీటి ప్రవాహానికి అంతరాయం కలగడంతో గతంలో విధించిన నిబంధనకు సడలింపు ఇవ్వాలని తీర్మానం చేసి మిగిలిన పనులు చేపట్టాలని ఇంజినీర్ ఇన్ చీఫ్‌కు నివేదిక పంపినట్లు తెలిపారు. అధికారుల సూచన, ప్రజాప్రతినిధుల అభ్యర్థన మేరకు పది కట్టడాలను పునరుద్ధరించాలని కోరుతూ రూ. 33.74 కోట్ల అంచనాతో చీఫ్ ఇంజినీర్ ఈఎన్సీకి నివేదిక పంపారన్నారు. అయితే పాలనాపరమైన అనుమతులు ఇవ్వకుండా 24-4-2024న లేఖను తిరిగి పంపినట్లు ఎగువ కాలువ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజశేఖర్ తన నివేదికలో పేర్కొన్నారు.



అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

గ్రామస్తులపై ఎలుగుబంటి దాడి

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

ఎలుగుబంటి దాడిలో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం మండలంలోని పడమటి కోటిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాలు.. పడమటి కోడిపల్లి గ్రామ శివారులో గురువారం మధ్యాహ్నం వర్షం కురిసింది. వర్షం ఆగిన తరువాత ఓ ఎలుగుబంటి కోడిపల్లి చెరువులో నుంచి గ్రామ శివారులో ప్రవేశించి హల్‌చల్ చేసింది. దీంతో గ్రామస్తులు ఆ ఎలుగుబంటిని తరిమి కొట్టేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన బోయ రవిచంద్ర, గొల్లలదొడ్డి గ్రామానికి చెందిన గొల్ల రాజుపై ఎలుగుబంటి దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. రవిచంద్రకు చెవి, మెడపై బలమైన గాయలవడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గొల్ల రాజు కాలు, చెయ్యి విరిగడంతో పాటు తలకు బలమైన గాయాలయ్యాయి. ఎట్టకేలకు గ్రామస్తులంతా కలిసి ఎలుగుబంటిని గ్రామం నుంచి తరిమారు. ఇంతలో సమాచారం అందుకున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సుబ్బరాయుడు సిబ్బందితో అక్కడికి చేరకుని పడమటి కోడిపల్లి, గొల్లదొడ్డి శివారులో గాలింపు చర్యలు చేపట్టినా ఎలుగుబంటి ఆచూకీ తెలియలేదు. గాయపడిన వారిని రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇదిలా ఉండగా పడమటి కోడిపల్లి చెరువులో కంపచెట్లు దట్టంగా ఏపుగా పెరిగి ఉండడం, ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఆహారం కోసం ఎలుగుబంట్లు గ్రామాల వైపు వస్తున్నాయని, అటవీ శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇకనైనా అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు స్పందించి కోడిపల్లి, పొబ్బర్లపల్లి, గొల్లదొడ్డి, తదితర గ్రామాల్లో అటవీ జంతువుల నుంచి రక్షణ కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మాతా మరణాలను అరికడదాం

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో పూర్తి స్థాయిలో మాతృ మరణాలను నియంత్రించేలా సంబంధిత వైద్య శాఖ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ హాల్లో జిల్లాస్థాయి మాతా శిశు మరణాల సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. గతేడాది అక్టోబర్ నుంచి ఈ ఏడాది జూన్ వరకు జరిగిన 17 మాత మరణాలలో ఆరు కేసులపై కలెక్టర్ సమీక్ష చేశారు. జిల్లాలో జరిగిన మాతమరణాలకు గల కారణాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఈబి.దేవి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాతృ మరణానికి గల కారణాలు తెలుసుకుని మరోసారి అలాంటి కారణంతో మరణం జరగకుండా వైద్యులు తమ సిబ్బంది ద్వారా తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. గర్భిణులు ప్రసవం తర్వాత తగిన జాగ్రతలు తీసుకోవాలని తెలిపారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు సిబ్బంది గర్భిణులకు అందించే న్యూట్రిషన్ ఫుడ్‌ను సంపూర్ణంగా తీసుకునేలా చూసి, రక్త హీనతతో బాధ పడకుండా చూడాలని ఆదేశించారు. మాత మరణం జరిగినపుడు జిల్లా నోడల్ టీం కూడా క్షేత్ర స్థాయికి వెళ్లి విచారించాలన్నారు. ఏ తల్లీ ప్రసవ అనంతరం అధిక రక్తస్రావంతో మరణించ కూడదన్నారు. ప్రసవం సమయంలో ప్రమాదకర లక్షణాలు వున్న గర్భిణీ స్త్రీల పట్ల తగిన జాగ్రతలు తీసుకొంటూ సుఖప్రసవం జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఈబి.దేవి, డిసిహెచ్‌ఎస్, డిఐఒ డా॥యుగంధర్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వైద్యుడు డా॥నవీన్ కుమార్, లక్ష్మన్న, హేమలత, పాల్గొన్నారు.

ఇంటి ముందు చెట్లు నాటాలి

జిల్లా ప్రజలు ప్రతి ఒక్కరూ వారి ఇంటి ముందు, పరిసర ప్రాంతాల్లో చెట్లు నాటే కార్యక్రమం చేపట్టాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ నగరపాలక ఉన్నత పాఠశాల ఆవరణంలో ప్రమీలమ్మ, వారి కుమారుడు అనిల్ సారథ్యంలో నిర్వహిస్తున్న ఎజిఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్ను, పెన్సిల్స్, క్రికెట్ కిట్లు, షటిల్ బ్యాట్స్ తదితర వస్తువులను కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. మొక్కలు నాటే కారక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డిస్కవరీ అనంతపురం పేరుతో చేస్తున్న సేవలు, చేపట్టే కార్యక్రమాలకు ప్రభుత్వం తరఫున వారికి సహాయ, సహకారం అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మూర్తి, అసిస్టెంట్ డైరెక్టర్ అగ్రికల్చర్ ప్రసన్న లక్ష్మి, ఏజీఎస్ ఫౌండేషన్ ప్రమీలమ్మ, అనిల్, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రాలు అందిస్తున్న సిపిఎం నాయకులు

పేదల గుడిసెలకు

పట్టాలివ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి గ్రామ పంచాయతీ టీవీ టవర్ వెనుక సర్వేనెంబర్ 194/8లో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని సిపిఎం నాయకులు కోరారు. ఈమేరకు గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గుడిసెలు వేసుకున్న లబ్ధిదారుల దరఖాస్తులను సిపిఎం నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 600 మంది పేదలు గుడిసెలు వేసుకుని జీవనం కొనసాగిస్తున్నారు. కూలీనాలి చేసుకుని జీవించే వీరు కనీస మౌలిక సదుపాయాలు లేకపోయినప్పటికీ నగరంలో బాడుగలు కట్టలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ నివసిస్తున్నారన్నారు. కావున ఉన్నతాధికారులు స్పందించి గుడిసెలు వేసుకున్న పేదలందరికీ పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం న్యూ కమిటీ కార్యదర్శి ఆర్‌వి.నాయుడు, నగర కార్యవర్గ సభ్యులు ఇర్ఫాన్, కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, కాలనీవాలసు పాల్గొన్నారు.

ఢిల్లీలో వైసిపి ధర్నా విజయవంతం : విశ్వ

ప్రజాశక్తి-వజ్రకరూరు

వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో దేశ రాజధాని ఢిల్లీలో చేపట్టిన ధర్నా విజయవంతమైందని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. కూడేరులోని పార్టీ కార్యాలయం లో గురువారం మండల అధ్యక్షులు జల్లిపల్లి రామచంద్రారెడ్డి అధ్యక్షతన విశ్వ ఎంపిపి, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. విశ్వ మాట్లా డుతూ రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి (టిడిపి, బిజెపి, జనసేనపార్టీల) దాడులను దేశ వ్యాప్తంగా ప్రజల దృష్టికి తీసుకెళ్లడంలో భాగంగా వైసిపి ఆధ్వర్యంలో ఢిల్లీలో ధర్నా చేపట్టారని తెలి పారు. ఆ ధర్నాకు సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్‌తో పాటు టిఎంసి కాంగ్రెస్, అన్న డిఎంకె, శివసేన, తదితర పార్టీలు మద్దతు తెలిపాయన్నారు. ధర్నాలో జగన్ ఎపిలో జరిగన అరాచకాలను ఎండగట్టారన్నారు. ప్రధాని మోడీ, కేంద్ర ప్రభుత్వం ఎపిలో జరుగుతున్న అరాచకాలకు అడ్డుకట్ట వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన 30 రోజుల్లో జరిగిన దాడుల దృశ్యాలను ఫొటో ఎగ్జిబిషన్ వీడియో చూసి మద్దతుగా వచ్చిన నాయకులు చలించిపోయారన్నారు. ఇక కేంద్ర బడ్జెట్‌లో ఎపికి ప్రత్యేకహోదా అంశం పక్కనపెట్టి అమరావతి రాజధానికి రూ. 15 వేల కోట్లు అప్పుగా ఇస్తామని, పోలవరం పూర్తి చేస్తామని పేర్కొనగా, దీన్ని సిఎం చంద్రబాబు తమ ఘనత అని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విభజన హామీల్లో చెప్పిన విధంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధుల కేటాయింపు, రైల్వే జోన్, ఉక్కు ఫ్యాక్టరీ గురించి కేంద్ర బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడంపై చంద్రబాబు నోరు మెదపకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు ప్రకటించిన తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు పెట్టుబడి సాయం, పంట బీమా, తదితర సంక్షేమ పథకాల గురించి ఎవరూ ఏమీ మాట్లాడక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో ఎంపీపీ నారాయణరెడ్డి, వైసిపి ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవి.రమణ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సిపి.వీరన్న, వైస్ ఎంపీపీ దేవా సుబ్బమ్మ, తదితరులు పాల్గొన్నారు.



డ్రాగన్ ఫ్రూట్ పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం: కలెక్టర్

ప్రజాశక్తి-ఆత్మకూరు

జిల్లాలో ఉద్యానవన పంటల సాగుకు మరింత ప్రోత్సాహం అందివ్వనున్నట్లు కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ తెలియజేశారు. గురువారం సాయంత్రం ఆత్మకూరు మండలంలోని పాపంపేటలో ఫారంపాండ్, కమ్యునిటీ ఫారంపాండ్, ఆత్మకూరు పరిధిలో డ్రాగన్ ఫ్రూట్, దానిమ్మ పంటలు, ఎఫ్ఇఒ కలెక్షన్ సెంటర్, పి.సిద్ధరాంపురంలో అంజూర పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రైతులతో మాట్లాడారు. పంటల సాగు, ఖర్చులు, ఆదాయం తదితర వివరాలను వారితో అడిగి తెలుసుకున్నారు. ఉద్యానవన పంటలు సాగు చేసే రైతులకు మరింత ప్రోత్సాహం అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ డిడి నరసింహారావు, ఏపీఎంఐపి పీడీ రఘునాథరెడ్డి, హార్టికల్చర్ ఏడీ ఫిరోజ్ ఖాన్, డ్రగ్స్ ఏడీ రమేష్ రెడ్డి, తహశీల్దార్ పరమేశ్వర స్వామి, మండల ఉద్యాన శాఖ అధికారి రత్నకుమార్, హార్టికల్చర్ ఎక్స్టెన్షన్ అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పరిరక్షించాలి : మేయర్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో మొక్కలు నాటడంతో పాటు వాటి పరిరక్షణపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని నగర మేయర్ మహమ్మద్ వసీం సూచించారు. నగరంలోని 2వ డివిజన్ పరిధిలోని కల్పనా జోష్ కాలనీలో గురువారం చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో మేయర్ వసీం పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజలే స్వచ్ఛందంగా వచ్చి మొక్కలు నాటుతామని చెప్పడం అభినందనీయమన్నారు. ప్రజలు అడిగిన వెంటనే నగరపాలక ఆధ్వర్యంలో మొక్కలు సరఫరా చేశామన్నారు. మొక్కలు నాటి వాటిని పరిరక్షించడం ద్వారా ప్రాణవాయువు లభించడంతో పాటు వాతావరణ కాలుష్యం తగ్గి వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ పుట్టినరోజు, పెళ్లిరోజు, పండగ రోజున మొక్కలు నాటడాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ప్రజలందరి సహకారంతో నగరాన్ని పచ్చని నగరంగా మారుద్దామని పిలుపునిచ్చారు. హెచ్‌ఎల్‌సి కాలవలో పూడిక ఎక్కువగా ఉండడంతో నగరపాలక ఆధ్వర్యంలో చేపట్టిన పూడికతీత పనులను మేయర్ పరిశీలించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ ఎడి ప్రసన్నలక్ష్మి, ఎఇ విజయ్ బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న మేయర్ వసీం, తదితరులు

రాజకీయ కక్షతోనే ఆదికేశవులు హత్య

ప్రజాశక్తి-రాయదుర్గం

మండలంలోని మెచ్చిరి గ్రామంలో ఈ నెల 9వ తేదీ జరిగిన ఆదికేశవులు హత్య కేసులో పది మంది నిందితులను అరెస్టు చేసినట్లు కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం డీఎస్పీ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. టిడిపికి చెందిన ఆదికేశవులు ఈ నెల 9వ తేదీ కర్నాటకలోని నాగసముద్రం నుంచి స్వగ్రామం మెచ్చిరికి వస్తుండగా రాష్ట్ర సరిహద్దులోని గురికారికుంట వద్ద హత్యకు గురయ్యాడని, అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. ఆదికేశవులుకు అదే గ్రామానికి చెందిన కాపు చంద్రశేఖర్‌రెడ్డికి కొంతకాలంగా రాజకీయ విభేదాలు, వర్గ కక్షలు ఉన్నట్లు తెలిపారు. ఏడాదిన్నర క్రితం గడ్డివామి విషయంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకోగా పోలీసులు ఇరు వర్గాలపై క్రిమినల్ కేసులు నమోదు చేశారన్నారు. అలాగే గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న హనుమంతరాయుడు, సత్యనారాయణ ఆలయ భూములను తమ పేరుపై రాయించుకున్నారనే కారణంగా గ్రామ సర్పంచి ఉలమ్మ కుమారుడు చంద్రశేఖర్‌రెడ్డి వారిని ఆలయంలో పూజలు చేయకుండా అడ్డుకున్నాడన్నారు. రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి రావడంతో ఆదికేశవులు తిరిగి అర్చకులు హనుమంతరాయుడు, సత్యనారాయణ చేత ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేయిస్తున్నాడ న్నారు. ఆదికేశవులు రాజకీయంగా ఎదగడం సహించలేక చంద్రశేఖర్‌రెడ్డి మరో 9 మంది కలిసి ఆదికేశవులును ఈ నెల 9వ తేదీ రాష్ట్ర సరిహద్దు వద్ద కాపు కాచి కత్తులు, మారణాయుధాలతో దాడి చేసి హత్య చేసినట్లు విచారణలో వెల్లడైందన్నారు. నిందితులను అరెస్టు చేసి జూనియర్ సివిల్ జడ్జి ఎదుట హాజరుపరచినట్లు డీఎస్పీ తెలిపారు. డీఎస్పీతో పాటు సిఐ శ్రీనివాసులు, ప్రసాద్ ఉన్నారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

నిందితులు అరెస్ట్ : డీఎస్పీ

కుమారులకు అంగవైకల్యం

పింఛను మంజూరు చేయాలని తల్లిదండ్రుల వేడుకోలు

ప్రజాశక్తి-లేపాక్షి

లేపాక్షిలో నివాసం ఉంటున్న సూర్యప్రకాష్, మంజులమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు కాగా వారు వికలాంగులు కావడంతో ఇంటికే పరిమితమయ్యారు. ఆ దంపతులు తెలిపిన వివరాలు.. వారికి ఇద్దరు సంతానం కాగా బాబు(16), నరేంద్ర(13) ఏళ్లని, ఇద్దరూ నడవలేరని, మానసిక స్థితి కూడా సరిగా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి తల్లి సపర్యలు చేస్తూ ఉంది. తండ్రి పంచాయతీ కార్యాల యంలో దినసరి కూలీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వికలాంగులైన ఇద్దరు కుమారులు ఇంటికే పరిమితమయ్యారని, పింఛను మంజూరు చేయాలని కోరుతున్నారు. పింఛను కోసం గతంలో కూడా పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా మంజూరు కాలేదని వాపోయారు. ఇకనైనా అధికారులు స్పందించి వికలాంగ పింఛను మంజూరు చేసి ఆదుకోవాలని ఆ దంపతులు కోరుతున్నారు.



వికలత్వంతో నడవలేని స్థితిలోఉన్న చిన్నారులు

సిసిఆర్‌సి కార్డులను సద్వినియోగం చేసుకోండి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-శింగనమల

ప్రభుత్వం మంజూరు చేసే సిసిఆర్‌సి కార్డులను కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ సూచించారు. గురువారం గార్లదిన్నె మండల కేంద్రంలోని వ్యసాయాధికారి కార్యాలయంలో కౌలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి కౌలు కార్డులు పొందేందుకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కౌలు రైతులు భూమి కౌలు తీసుకున్న తర్వాత పంట సాగు చేసినప్పుడు పంట నమోదు చేయించుకోవాలన్నారు. పంట నమోదు చేసుకుంటే ప్రకృతి వైఫరీత్యాల కారణంగా పంటలు నష్టపోతే పరిహారంతోపాటు ప్రభుత్వ రాయితీలను పొందవచ్చున్నారు. అంతేగాకుండా కౌలు కార్డు పొందిన రైతులకు బ్యాంకు రుణాలు కూడా ఇస్తారని తెలిపారు. ప్రతి సంవత్సరం రెన్యూవల్ చేసుకుని వాయిదాలు చెల్లిస్తే ఒక్కో రైతు రూ.లక్ష వరకూ రుణం పొందే అవకాశం ఉందన్నారు. అనంతరం ఇప్పటివరకు మండలంలో సాగు చేసిన పంటలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ లోకేశ్వరి, డిప్యూటీ తహశీల్దార్ విజయ్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి పి.సోమశేఖర్, ఎఇఒ స్రవంతి, విఆర్‌ఒ గోపాల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : కౌలు రైతులు పంట సాగు హక్కు పట్టాలను పొందాలని జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వర సూచించారు. గురువారం మండలంలోని వడియంపేట గ్రామంలో కౌలురైతులతో సమావేశం నిర్వహించి కౌలు రైతులకు ఇచ్చే సాగు హక్కు పత్రాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయధికారి శ్యామ్‌సుందర్‌రెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారిణి శిరీషా, వ్యవసాయ సహాయకుడు శ్రీనివాస్, ఎంపిఇఒ తిరుమలేష్, రైతులు పాల్గొన్నారు.

అనంతపురం : కౌలు రైతులు తప్పనిసరిగా కౌలు గుర్తింపు కార్డు పొందాలని అనంతపురం రూరల్ మండల వ్యవసాయ అధికారిణి జె.శశికళ సూచించారు. గురువారం అనంతపురం రూరల్ కొడిమి, ఏ.నారాయణపురం ఆర్‌ఎస్‌కె పరిధిలోని గ్రామాల్లో కౌలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌలుకు సాగు చేస్తున్న ప్రతి రైతూ గుర్తింపు కార్డు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బి.మురళీకృష్ణ, గ్రామ ఉద్యానశాఖ సహాయకులు రాజేశ్వరి, నాగలత, రైతులు, పాల్గొన్నారు.

వజ్రకరూరు : సిసిఆర్‌సి కార్డులను కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉరవకొండ డివిజన్ ఎడిఎ పద్మజ సూచించారు. గురువారం విడపనకల్ మండల పరిధిలోని చీకులగురికి, ఉండబండ గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి పెన్నయ్య ఆధ్వర్యంలో కౌలు రైతులతో సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా కౌలుదారు హక్కు పత్రాలు పొందే విధి విధానాలపై సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన భూమిలేని రైతులు, ఇతర రైతుల వద్ద నుంచి భూమి కౌలుకు తీసుకున్న రైతులందరూ అర్హులన్నారు. అదేవిధంగా దేవాలయ భూములను కౌలుకు చేస్తూ గుత్తు చెల్లించే వారు కూడా అర్హులని తెలిపారు. సిసిఆర్‌సి కార్డులు పొందడానికి ఆలయ భూములు సాగు చేసే గుత్త రసీదులు, కౌలు రైతుల ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్ పుస్తకాలను జత చేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ మునాఫ్, రైతు సేవా కేంద్రాల సిబ్బంది లక్ష్మన్న, ఎంపిఇఒ లక్ష్మన్న, కౌలు రైతులు, తదితరులు పాల్గొన్నారు.



గార్లదిన్నెలో కౌలు రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

గుంతకల్లు రూరల్ : మండల పరిధిలోని కౌలు రైతులందరూ సంబంధిత ఆర్‌బికె కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కేసువాతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భూమిని కౌలుకు తీసుకుని సాగు చేసుకునే రైతులందరూ తప్పనిసరిగా కౌలు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. తద్వారా ప్రభుత పథకాలు పొందడంతోపాటు బ్యాంకు రుణం పొందవచ్చున్నారు.

సాగు, తాగునీటికి నిధులు మంజూరు చేయాలని వినతి



చంద్రబాబుతో మాట్లాడుతున్న శ్రావణిశ్రీ

నార్పల : శింగనమల నియోజకవర్గంలో సాగు, తాగునీటి సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని గురువారం అసెంబ్లీ సమావేశ భవనంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ విన్నవించారు. ఈ సందర్భంగా చంద్రబాబుతోపాటు మంత్రి నిమ్మల రామనాయుడును వేర్వేరుగా కలిసి సమస్యను వివరించారు.

దోమల నివారణకు చర్యలు

పుట్లూరు : గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు చేపట్టినట్లు వైద్యాధికారిణి శ్రీవాణి తెలిపారు. ఇందులో భాగంగా గురువారం మండల పరిధిలోని కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి గ్రామాల్లో దోమ లార్వా తినడానికి గంబూజియా చేపలను నీటి కుంటల్లో వదిలారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటి కుంటల్లో గంబూజియా చేపలను వదలడం వల్ల దోమ లార్వాను తింటాయన్నారు. ఇందుకోసమే నీటి కుంటల్లో చేపలను వదులుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



చేపలను వదులుతున్న అధికారులు

కుష్టువ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాను కుష్టువ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ హాల్లో జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కుష్టువ్యాధిపై ఉన్న అపోహలపై ప్రజలకు వివరించాలన్నారు. కుష్టువ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. ఇందులో భాగంగానే జులై 18నుంచి ఆగస్టు 2వ తేదీ వరకూ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. అలాగే జిల్లాలోని ప్రతి వ్యక్తికీ కుష్టువ్యాధి పరీక్షలు చేయాలని ఆదేశించారు. ఇకపోతే సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ఇబి.దేవి, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ జిల్లా అధికారి అనుపమ జేమ్స్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి శ్రీదేవి, డిపిఒ ప్రభాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

'సేవాలాల్' జయంతి ఉత్సవాలకు నిధులు మంజూరుకు వినతి

వజ్రకరూరు : గుత్తి మండలంలోని సేవాఘడ్‌లో వెలసిన సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలకు రూ.50లక్షలు మంజూరుకు సాధారణ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని సిఎం చంద్రబాబుకు మంత్రి పయ్యావుల కేశవ్ విజ్ఞప్తి చేశారు. సేవాఘట్‌లో ప్రతి ఏడాది ఫిబ్రవరి 13 నుంచి 15వ తేదీ వరకూ సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారన్నారు. ఉత్సవాలకు దేశవ్యాప్తంగా లక్షలాది మంది భక్తులు హాజరవుతారన్నారు. కావున ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు రూ.50 లక్షలు మంజూరు చేయాలని కోరారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి-అనంతపురం

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి..శివప్రసాద్‌యాదవ్ సూచించారు. గురువారం నగరంలోని ఆర్‌టిఒ కార్యాలంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవింగ్ లైసెన్స్ పొందడానికి వచ్చిన వారితో మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రమాద నివారణకు హెల్మెట్ ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రవాణా డిప్యూటీ కమిషనర్ ఎం.వీర్రాజు, కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి..శివప్రసాద్‌యాదవ్

శిక్షణ తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న ఆర్‌డిఒ శ్రీనివాసరెడ్డి

గుత్తి : స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బ్యుటీషియన్ కోర్సు శిక్షణ తరగతులను ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి, గుంతకల్లు ఆర్‌డిఒ శ్రీనివాసరెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతులకు ఉచితంగా బ్యుటిషియన్ కోర్స్‌పై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ ఢిల్లేశ్వరి, ఎసిడిపిఒ అగిశం నాగమణి, సూపర్‌వైజర్ నాగేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నార్పల : మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో నూతనంగా నిర్మించనున్న లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి నార్పలకు చెందిన తీగల నారాయణరెడ్డి, భార్య అన్నపూర్ణమ్మ రూ.1లక్షను ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మేంద్రస్వామికి విరాళంగా అందజేశారు. సొంత గ్రామంలో లక్ష్మీనరసింహ స్వామి ఆలయం నిర్మించేందుకు సాయం చేయడం సంతోషంగా ఉందని నారాయణరెడ్డి తెలిపారు.



విరాళం అందజేస్తున్న తీగల నారాయణరెడ్డి

రైతులకు నాణ్యమైన నారు విక్రయించాలి

కళ్యాణదుర్గం డివిజన్ ఉద్యాన అధికారి ఎం.కృష్ణతేజ

ప్రజాశక్తి-బెలుగుప్ప

రైతులకు నాణ్యమైన నారును విక్రయించాలని కళ్యాణదుర్గం డివిజన్ ఉద్యాన శాఖ అధికారి ఎం.కృష్ణతేజ ఆయా నర్సరీల నిర్వాహకులకు సూచించారు. గురువారం కళ్యాణదుర్గం డివిజన్‌లోని నర్సరీలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళ్యాణదుర్గం డివిజన్‌లో ఉన్న నర్సరీ నిర్వాహకులకు నర్సరీ చట్టం-2010 ప్రకారం నర్సరీ లైసెన్స్, రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోమని కోరారు. అంతేగాకుండా నర్సరీ యజమానులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు విత్తనాల ప్యాకెట్‌పై విత్తన రకం, లాట్ నెంబర్, కంపెనీ లేబుల్‌ని చూసి నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. విత్తనాలు కొన్న రసీదును జాగ్రత్తగా భద్ర పరచుకోవాలన్నారు. నర్సరీ రిజిస్టర్లు, నారు ధరల పట్టికను నర్సరీ బయట పొందుపరచాలన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ, ఆర్‌బికె సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు నాణ్యమైన నారునే విక్రయించాలి కళ్యాణదుర్గం డివిజన్ ఉద్యాన అధికారి ఎంకృష్ణతేజ

27న అఖిలపక్ష సమావేశం

అనంతపురం : 'పేదలకు ఉచిత వైద్యం.. జీవించి హక్కు'లో భాగంగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అభివృద్ధి కోసం ఈనెల 27న అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఎపి పట్టణ పౌర సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు ఎజి రాజమోహన్, శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపి పట్టణ పౌర సంఘాల ఐక్యవేదిక, పట్టణ పౌరసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో దేశంలోనే నిత్యం కరువు, వలసలతో అత్యంత వెనుకబడిన అనంతపురం జిల్లాలో పేదలపాలిట వరంగా మారిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రత్యేక బడ్జెట్, ప్రత్యేక పరిపాలన వ్యవస్థ కోసం అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

'మై గవర్నమెంట్ సాతి' అవార్డుకు బిసాటి జీవన్‌కుమార్ ఎంపిక

ప్రజాశక్తి-అనంతపురం



భారత ప్రభుత్వం అందజేసే మై గవర్నమెంట్ సాతి అవార్డుకు జిల్లాకు చెందిన బిసాటి జీవన్‌కుమార్ ఎంపికయ్యారు. మై గవర్నమెంట్‌ను స్థాపించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డులను అందిస్తోంది. ఇందులో భాగంగా ఈయన ఈనెల 26న కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సహాయ మంత్రి జితిన్ ప్రసాద్‌తో ఢిల్లీలోని ఇండియా హాబిటేట్ సెంటర్‌లో అవార్డు అందుకోనున్నారు. ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వ సమాచారాన్ని మై గవర్నమెంట్ ద్వారా యువతకు తెలిజేయడంతోపాటు ఆన్‌లైన్‌లో అవగాహన కల్పించి ఎక్కువ మొత్తంలో యువతను మై గవర్నమెంట్‌లో భాగం చేసినందుకు బిసాటి జీవన్‌కుమార్ అవార్డు అందుకోనున్నారు. ఈ సందర్భంగా బిసాటి జీవన్‌కుమార్‌ను నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువ అధికారి కె.మణికంత, ప్రోగ్రాం ఇన్‌ఛార్జి జి.శ్రీనివాసులు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎసిఆర్.దివాకర్‌రెడ్డి, అర్బన్ బ్యాంకు డైరెక్టర్ సుంకర రమేష్ అభినందించారు.

పెద్దాసుపత్రిలో అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు 'పుట్టినిల్లు' ఆశ్రమం ఆధ్వర్యంలో అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పేదలకు గురువారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి మాట్లాడుతూ ట్రస్టు సభ్యులు బి.అమానుల్లా బాబా కుమారుడు బి. సోనునిఫున్ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ఓబుళపతి, కిష్టప్ప, నబిరసూల్, నల్లప్ప, రవికుమార్, మణిదీప్, లక్ష్మీనారాయణ, పుష్ప, నవ్యశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు హర్షణీయం

శింగనమల : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించడం హర్షణీయమని తెలుగు యువత రాష్ట్ర మాజీ కార్యదర్శి మాసూల చంద్రమోహన్ గురువారం ఒక ప్రకటనలో అన్నారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ కృషితోనే కేంద్రం విరివిగా నిధులు మంజూరు చేసిందన్నారు. ముఖ్యంగా రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్లతోపాటు పోలవరం ప్రాజెక్టుకు అధిక నిధులు కేటాయించడం సంతోషకరమన్నారు. వీటితోపాటు విభజన చట్ట ప్రకారం వివిధ కారిడర్లకు, ఉత్తరాంధ్ర, రాయలసీమ, ప్రకాశం జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీని ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

నూతన బోర్లు ఏర్పాటు

వజ్రకరూరు : రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చొరవతో విడపనకల్, ఉండబండ గ్రామాల్లో నూతన బోర్లు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉన్న విషయాన్ని మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి స్థానిక సర్పంచులు, నాయకులు తీసుకెళ్లగా స్పందించి ఆయన కొత్త బోర్లు, పైప్‌లైన్, మోటార్లను ఏర్పాటు చేసి తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు తిప్పారెడ్డి, తిమ్మరాజు, చంద్రశేఖర్, జనార్ధన్, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి వన్నూరు స్వామి, తిప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కళ్యాణ్‌ను కలిసిన ఎమ్మెల్యే శ్రావణిశ్రీ



పవన్‌కళ్యాణ్‌కు పూలమొక్క అందజేస్తున్న బండారు శ్రావణిశ్రీ

శింగనమల : అసెంబ్లీ సమావేశాల్లో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా నియోజకవర్గ సమస్యలతోపాటు గ్రామీణ తాగునీరు, పారిశుధ్యానికి సంబంధించిన పెండింగ్ బిల్లులు, అభివృద్ధి పనులపై చర్చించారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ సుబ్బరాజు

వజ్రకరూరు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆధార్ స్పెషల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఉరవకొండ ఎంపిడిఒ సుబ్బరాజు కోరారు. గురువారం మండల కేంద్రంలోని సచివాలయం-2లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి చంద్రమౌళి, మాధవరెడ్డి, పరిపాలనా అధికారి జయరాములు, పంచాయతీ కార్యదర్శులు గౌస్ సాహెబ్, రవికుమార్, పాండు, ఉమాదేవి, డిజిటల్ అసిస్టెంట్లు తేజేష్, నూర్‌బాషా, జగదీశ్వర్‌నాయక్, గంగేశ్వర్, చంద్రమోహన్‌రాజు, ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండల పరిధిలోని శీర్పి, కాలువపల్లి గ్రామ పంచాయతీల్లో గురువారం ఏర్పాటు చేసిన ఆధార్ స్పెషల్ కేంద్రాలను ఎంపిడిఒ సుబ్బరాజు పరిశీలించారు. ఇందులో భాగంగా ఆధార్ కేంద్రానికి వస్తున్న ప్రజల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారులు మాధవరెడ్డి, ఉమాదేవి, డిజిటల్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై బిజెపి మోసం

గుత్తి : ఎస్సీ వర్గీకరణ చేయకుండా మాదిగ, ఉపకులాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మోసం చేసిందని ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు అంజన ప్రసాద్ విమర్శించారు. గురువారం అనంతపురంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణరాజు మాదిగ ఆధ్వర్యంలో ఆగస్టు 9న చేపట్టనున్న చలో ఢిల్లీ మాదిగల మహాధర్నాకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చిరంజీవి, కార్యదర్శి సుదర్శన్, గౌరవాధ్యక్షులు హనుమంతు, నాయకులు అజయ్ బాబు, ఎం.రామాంజనేయులు, పాలవాయి, రాళ్లపల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రిప్పు వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని సోదనపల్లి గ్రామంలో ఎపిఎంఐపి ఆధ్వర్యంలో నెటఫిమ్ కంపెనీ వారు డ్రిప్పు వ్యవసాయంపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కూరగాయలు, చీనీ తోటలకు ట్రిప్పు ఎలా వదులుకోవాలి.. ఎలా క్లీన్ చేసుకోవాలి.. క్లీన్ చేయడం వల్ల ఎన్ని సంవత్సరాలు డ్రిప్పు ఉపయోగపడుతుందనే విషయాలపై ఎపిఎంఐపి పీడీ రఘునాథ్‌రెడ్డి అవగాహన కల్పించారు. డ్రిప్పుల్లో మందు పంపించడం వల్ల పైపులు బ్లాక్ అయితే వాటిని యాసిడ్ ద్వారా శుభ్రం చేసుకోవచ్చన్నారు. తద్వారా పదేళ్లు డ్రిప్పు వైరు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఐఇ శంకర్‌రెడ్డి, రైతు భరోసా విహెచ్‌ఎ రాజారెడ్డి, నెటఫిమ్ కంపెనీ డిసిఒ భాస్కర్, రమణారెడ్డి అగ్రనమిస్టు, ఫీల్డ్ ఆఫీసర్ యు.ఓబులేష్‌నాయుడు, రైతులు చాగంటి గురుమూర్తిరెడ్డి, చాగంటి హేమచంద్రారెడ్డి, కురువ చిన్నఎర్రిస్వామి, సురేష్, కుళ్లాయప్ప, డాల్ రమేష్, ఓబులేష్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



డ్రిప్పు వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

అన్నదానానికి ఆర్థికసాయం

గుత్తి : మండలంలోని పూలకుంట గ్రామంలో జరిగే అన్నదానానికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ సోదరుడు నారాయణ గురువారం ఆర్థికసాయం అందజేశారు. గ్రామంలో కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు (పీర్ల పండుగ)ను పురస్కరించుకుని గ్రామపెద్దలు అన్నదానం చేయనున్నారు. విషయం తెలుసుకున్న గుమ్మనూరు నారాయణ పట్టణంలోని టిడిపి కార్యాలయంలో రూ.10వేలు నగదును గ్రామ పెద్దలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎంకే.చౌదరి, జక్కలచెరువు ప్రతాప్, గోవిందు, ఎన్.జయన్న, బేతాపల్లి శీనా, మాజీ సర్పంచి కొండయ్య పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న గుమ్మనూరు నారాయణ

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన మాజీ కార్పొరేటర్ నటేష్‌చౌదరి

అనంతపురం కార్పొరేషన్ : మాజీ కార్పొరేటర్ నటేష్‌చౌదరి టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును విజయవాడలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా విజయం కోసం తాను చేసిన కృషిని రాష్ట్ర అధ్యక్షుడికి వివరించారు. తన సేవలు గుర్తించి భవిష్యత్ లో రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసే రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టుల్లో తనకు అవకాశం కల్పించాలని కోరారు.

ఓడిఎఫ్ సర్వే వేగవంతం చేయాలి : డిఎల్‌పిఒ

ప్రజాశక్తి-నార్పల

మండల వ్యాప్తంగా ఓడిఎఫ్ పల్స్ సర్వే వేగవంతం చేయాలని డిఎల్‌పిఒ సుమన జయంతి సూచించారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ రాముడు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో డిఎల్‌పిఒ మాట్లాడుతూ నార్పల మండలం జిల్లాలోనే ఓడిఎఫ్ పల్స్ సర్వేలో వెనుకబడిందన్నారు. కావున సచివాలయ ఉద్యోగులందరూ సమన్వయంతో ఒడిఎఫ్ పల్స్ సర్వేను పూర్తి చేయాలని సూచించారు. అలాగే ప్రతి సచివాలయంలో సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఫొటోలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఇఒఆర్‌డి శైలజారాణి, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఎల్‌పిఒ సుమనజయంతి

30న మండల సమావేశం

నార్పల : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండల అధ్యక్షులు నాగేశ్వరరావు అధ్యక్షతన ఈనెల 30న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ రాముడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హాజరవుతారన్నారు. కావున అన్నిశాఖల అధికారులు వారి శాఖల నివేదికలను తీసుకుని హాజరుకావాలని కోరారు.

27న ఆత్మకూరులో..

ఆత్మకూరు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండల అధ్యక్షులు సుబ్బర హేమలత అధ్యక్షతన ఈనెల 27న శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ దశరథ రామయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే పరిటాల సునీత హాజరవుతారని, కావున అన్నిశాఖల అధికారులు వారి శాఖల నివేదికలతో హాజరుకావాలని కోరారు.

కార్మికుల పక్షపాతి కామ్రేడ్ అబ్దుల్ వహాబ్



సభలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీష్

గుంతకల్లు : దివంగత కామ్రేడ్ అబ్దుల్ వహాబ్ కార్మిక పక్షపాతి అని వామపక్ష, మైనారిటీ సంఘాల నాయకులు కొనియాడారు. గురువారం స్థానిక బిటి పక్కీరప్ప భవనంలో అబ్దుల్ వహాబ్ సంతాప సభ నిర్వహించారు. ఇందులో భాగంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీష్, జిల్లా కార్యదర్శి సి.జాఫర్, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సిపిఎం జిల్లా నాయకులు దాసరి శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యుడు మారుతీప్రసాద్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు జిలాన్‌బాషా, టిడిపి నాయకులు ఖాజా, ఫ్రూట్ మస్తాన్, అంజుమన్ కమిటీ నాయకులు వలీభాషా, ఆర్‌డిజి బాషా, తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారం

నార్పల : మండల పరిధిలోని గడ్డంనాగేపల్లి వడ్డెర కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించారు. ఆరు నెలల నుంచి నిర్వహణ లోపంతో తాగునీటి సమస్య ఏర్పడిందని పలువురు కాలనీ మహిళలు ఎంపిడిఒ రాముడు దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన నడిమిదొడ్డి కార్యదర్శి లక్ష్మీదేవి, గడ్డంనాగేపల్లి కార్యదర్శి హర్షవర్ధన్‌తో మాట్లాడి 24 గంటల్లోపు నీటి సమస్య పరిష్కరించారు. దీంతో కాలనీ మహిళలు హర్షం వ్యక్తం చేశారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

నార్పల : ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన హామీ మేరకు రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలను వెంటనే ఖాతాల్లోకి జమ చేయాలని ఎపి రైతుసంఘం నాయకుల డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని తిక్కస్వామి ఆలయ అవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు డి.చిన్నప్పయాదవ్ మాట్లాడుతూ జిల్లాలో పంటలు నష్టపోతున్న రైతులకు పెట్టుబడి సాయం అందించి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా అవసరమన్నారు. పెట్టుబడి సాయంతోపాటు పెసర, అలసంద, ఉలవ, సజ్జ, జొన్న, కొర్ర వంటి విత్తనాలను 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నేరాలు ఘోరాలు

పాముకాటుతో రైతు మృతి



మృతిచెందిన శ్రీనివాసరెడ్డి

గుత్తి : మండల పరిధిలోని బేతాపల్లి గ్రామంలో బుధవారం అర్ధరాత్రి పాముకాటుకు గురై ఓ రైతు మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసరెడ్డి (46) తన పంట పొలంలో నిద్రిస్తుండగా పాము కాటు వేసింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆయన్ను గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బోర్‌వెల్ జీపు బోల్తా..

పుట్లూరు : మండలంలో బోర్‌వెల్ జీపు అదుపుతప్పి బోల్తా పడింది. మండల కేంద్రానికి చెందిన మెకానిక్ నాగార్జున గురువారం కడవకల్లుకు వెళ్లి బోరు మరమ్మతులు చేసి నారాయణరెడ్డిపల్లి మీదుగా తిరిగి వస్తుండగా పుట్లూరు చెరువుకొండ ప్రాంతంలోకి రాగానే బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. అప్రమత్తమైన నాగార్జున వాహనాన్ని పక్కన ఉన్న గోతిలోకి తిప్పాడు. అయితే జీపు బోల్తాపడిన ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.